# ప్రజాస్వరం

PRAJASWARAM తెలుగు దినపత్రిక

MHR TV www.MHRtv.com

మెదక్ | సంపుటి: 19 సంచిక: 06 | ఆదివారం, 07 సెప్టెంబర్ 2025 | పేజీలు: 06 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamada-Vijayawada-Guntur-Vizag Adilabad Kurnool | www.prajaswaramdaily.com




# బై..బై..గణేశా!

## మధ్యాహ్నం 1.42 గంటలకు ఖైరతాబాద్ వినాయకుడి నిమజ్జనం





విగ్రహాల నిమజ్జనంపై పోలీసుల వ్యూహం సక్సెస్
మంత్రి పొన్నం, మేయర్ ఉన్నతాధికారుల ఏరియల్ సర్వే
సీసీ కెమెరాలతో పర్యవేక్షించిన సీపీ
నేటి ఉదయం కల్లా పూర్తి చేస్తామని స్పష్టం
కమాండ్ కంట్రోల్ నుంచి మేయర్, కమిషనర్ పర్యవేక్షణ
ఆలస్యంగా కదిలిన గణనాథులు
హుస్సేన్ సాగర తీరం జన సంద్రం
రెండో రోజు కొనసాగనున్న నిమజ్జనం


**హైదరాబాద్ సెప్టెంబర్ 06(ప్రజాస్వరం):**

11 రోజుల పాటు పూజలందుకున్న గణనాథుడికి శనివారం మహానగరవాసులు ఘనంగా వీడ్కోలు పలికారు. 'గణపతి బప్పా మోరియా.. బై బై గణేశా' అంటూ భక్తులు చేసిన నినాదాలతో నగరం మారుమోగింది. బ్యాండ్ మేళాలు, గల్లీలో తీన్మార్ డ్యాన్స్‌లు, విచిత్ర వేషధారణలు, ఆటలు, పాటలతో నిమజ్జనోత్సవం ఉత్సాహంగా సాగింది. ఈసారి రికార్డు స్థాయిలో జనం తరలిరావడంతో సాగర తీరం జనసంద్రంగా మారింది. పోలీసులు రూపొందించిన వ్యూహం ప్రకారం, నగరంలోని ప్రధాన విగ్రహాలైన ఖైరతాబాద్, బాలాపూర్ గణపతుల నిమజ్జనం వేగంగా పూర్తయింది. ఉదయం 6:30 గంటలకు బయలుదేరిన ఖైరతాబాద్ గణేశుడు, మధ్యాహ్నం 1:42 గంటలకు హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనమయ్యారు. ఈ విగ్రహం నిమజ్జన యాత్ర ఆరు గంటల

..మిగతా 2లో

## హైదరాబాద్‌లో భారీ డ్రగ్స్ ఫ్యాక్టరీ గుట్టురట్టు

చర్లపల్లి ఫ్యాక్టరీపై ముంబై పోలీసుల మెరుపుదాడి
రూ. 12,000 కోట్ల విలువైన మెఫెడ్రోన్ స్వాధీనం
ఫ్యాక్టరీ యజమాని సహా 12 మంది అరెస్ట్
వాఘ్దేవి ల్యాబ్స్ పేరుతో నకిలీ లైసెన్స్‌తో దందా
పలు రాష్ట్రాలకు డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు గుర్తింపు



**చర్లపల్లి సెప్టెంబర్ 06(ప్రజాస్వరం):**

హైదరాబాద్ చర్లపల్లి ఒక చిన్న ప్రాంతమే కానీ... అక్కడి నుండి వెలువడిన విషయం దేశ వ్యాప్తంగా సంచలనం రేపుతోంది. కెమికల్ ఫ్యాక్టరీ పేరుతో మాయ చేసి భారీ స్థాయిలో డ్రగ్స్ తయారీ జరుగుతుండగా, మహారాష్ట్ర క్రైమ్ బ్రాంచ్ దాడి చేసి షాకింగ్ నిజాలు బయటపెట్టింది.

**రూ.12 వేల కోట్ల డ్రగ్స్ స్వాధీనం**

దాడిలో అధికారులు రూ.12 వేల కోట్ల విలువైన ఎండీ, ఎమ్‌ఏ ముడి పదార్థాలు

..మిగతా 2లో

## విజ్ఞతకే వదిలేస్తున్నా

నా రాజకీయ ప్రస్థానం తెరిచిన పుస్తకం
క్రమశిక్షణ గల కార్యకర్తగా పనిచేస్తున్నా
కేసీఆర్ నాయకత్వంలో మళ్లీ అధికారంలోకి
మాజీ మంత్రి హరీష్ రావు
గులాబీ బాస్‌తో ముఖ్య నేతల కీలక భేటీ



**చర్లపల్లి సెప్టెంబర్ 06(ప్రజాస్వరం):**

గత కొంతకాలంగా తనపై, బీఆర్ఎస్‌పై కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు ఘాటుగా స్పందించారు. ఆ వ్యాఖ్యలు ఎందుకు చేశారో

..మిగతా 2లో

## నిమజ్జనానికి సింపుల్‌గా సీఎం

ఏమైనా ఇబ్బందులున్నాయా?
ఎప్పటికప్పుడు వ్యర్థాలు తొలగిస్తున్నారా?
ఏర్పాట్లపై ఆరా తీసిన రేవంత్ రెడ్డి



2

## సంస్కృతి సంరక్షణ

రాబోయే తరాలకు సంస్కృతిని అందించాలి
కశ్మీర్ నుంచి కన్యాకుమారి.. వరకు ఐక్యతతో ఉండాలి
బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్



2

## తెలంగాణలో పింఛన్లు పెంచే వరకు ఉద్యమం

మందకృష్ణ మాదిగ



2

## బాలాపూర్ లడ్డూ@ రూ.35 లక్షలు

గతేడాది కంటే రూ.4.99లక్షలు అధికం
దక్కించుకున్న లింగాల దశరథ్ గౌడ్



2

# నిమజ్జనానికి సింపుల్‌గా సీఎం

- ఏమైనా ఇబ్బందులున్నాయా?
- ఎప్పటికప్పుడు వ్యర్థాలు తొలగిస్తున్నారా?
- ఏర్పాట్లపై ఆరా తీసిన రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ సెప్టెంబర్ 06(ప్రజాస్వరం):**

గణేష్ నిమజ్జనోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సడెన్ ఎంట్రీతో అందరినీ ఆశ్చర్యానికి గురి చేశారు. శనివారం సాయంత్రం ఎన్టీఆర్ మార్గ్ వద్ద సాంప్రదాయ దుస్తుల్లో హాజరై, నిమజ్జనంలో పాల్గొని తన ప్రత్యేకతను చాటుకున్నారు. గత ఏడాది కూడా ఆయన ఇక్బాల్ మినార్ నుంచి సచివాలయం వరకు ఖైరతాబాద్ గణేశ్ ఊరేగింపులో ముందు నడిచి సరికొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. సాధారణంగా ముఖ్యమంత్రి పర్యటన అంటే భారీ కాన్వాయ్ ఉంటుంది. కానీ రేవంత్ రెడ్డి ఎటువంటి ముందస్తు సమాచారం, కాన్వాయ్ సైరన్ లేకుండా, కేవలం మూడు కార్ల కాన్వాయ్‌తో ఎన్టీఆర్ మార్గ్‌లోని క్రేన్ నెం.4 వద్దకు వచ్చారు. భద్రత లేకుండా నలుగురైదుగురు వ్యక్తిగత సిబ్బందితో వచ్చి, నిమజ్జనం తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. విగ్రహాల నిమజ్జనం తర్వాత వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారా అని అడిగి వివరాలు తెలుసుకున్నారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి నిమజ్జనం ఏర్పాట్లను ముఖ్యమంత్రికి వివరించారు. ముఖ్యమంత్రి సడెన్‌గా నిమజ్జనంలో ప్రత్యక్షం కావడంతో ఆయన్ను కలిసేందుకు జనం ప్రయత్నించారు. భక్తులను ఆప్యాయంగా పలకరిస్తూ, వారికి ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. ముందుగా చార్మినార్ వద్ద నిమజ్జన ప్రక్రియను చూడాలని సీఎం భావించినా, ఆ తర్వాత ఎన్టీఆర్ మార్గ్‌కు రావడం ప్రజలను ఆకట్టుకుంది. సుమారు అరగంట సేపు నిమజ్జనాన్ని పరిశీలించిన తర్వాత సీఎం తన కాన్వాయ్ నుంచి భక్తులకు అభివాదం చేస్తూ వెళ్లిపోయారు.

# హైదరాబాద్‌లో భారీ డ్రగ్స్ ఫ్యాక్టరీ గుట్టురట్టు

మొదటిపేజీ తరువాయి





డ్రగ్స్, అలాగే 32 వేల లీటర్ల రా మెటీరియల్ పట్టుకున్నారు. ఈ స్థాయిలో మత్తు పదార్థాలు స్వాధీనం కావడం దేశంలోనే అరుదని చెబుతున్నారు.

**బంగ్లాదేశీ మహిళ లింక్ – అసలు నెట్‌వర్క్ బహిర్గతం**

ఒక బంగ్లాదేశీ మహిళ అరెస్టుతో మొదలైన ఈ కేసు, చివరికి భారీ అంతర్జాతీయ డ్రగ్ మాఫియా నెట్‌వర్క్‌ను బయటపెట్టింది. తయారీదారులు - సరఫరాదారులు కలిసి హైద్రాబాద్ ను ప్రధాన కేంద్రంగా మార్చినట్టు అధికారులు అనుమానిస్తున్నారు.

**వాసు దేవి కెమికల్ ఫ్యాక్టరీ మాటున మత్తు వ్యాపారం**

బయటికి కెమికల్ ఫ్యాక్టరీగా కనిపించిన ఈ స్థావరం వాస్తవానికి దేశవ్యాప్తంగా డ్రగ్స్ సరఫరా కేంద్రంగా పనిచేసింది. ఆధునిక యంత్రాలతో, రసాయనాల ముసుగులో లక్షల కోట్ల వ్యాపారం సాగిందని సమాచారం.

**13 మందిపై గట్టి వల**

ఇప్పటివరకు 13 మంది నిందితులు అరెస్టు అయ్యారు. వీరిలో డ్రగ్స్ తయారీదారులు, సరఫరాదారులు, కీలక మధ్యవర్తులు ఉన్నారు. ఇంకా పలువురు ముఖ్య నెట్‌వర్క్ సభ్యులు పోలీసుల రాడార్‌లో ఉన్నారని సమాచారం.

**దేశ వ్యాప్తంగా కలకలం**

ఈ ఆపరేషన్ వివరాలు బయటపడటంతో అన్ని రాష్ట్రాల్లో కలకలం రేగింది. ఇప్పటికే కేంద్ర ఏజెన్సీలు కూడా రంగంలోకి దిగాయి. అంతర్జాతీయ డ్రగ్ మాఫియాతో సంబంధాలపై స్పష్టత రావడానికి దర్యాప్తు వేగవంతం అవుతోంది. చర్లపల్లిలోని ఈ డ్రగ్స్ గుట్టురట్టు చర్య స్థానిక సమాజంలో శాంతి, భద్రత పెంచే దిశగా పెద్ద ముందడుగు అని పోలీసులు అభివర్ణించారు. దర్యాప్తు కొనసాగుతున్న సమయంలో మిగిలిన సహచరుల గుర్తింపు కోసం పోలీసు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. చర్లపల్లి లోని ఈ డ్రగ్స్ గుట్టురట్టు చర్య స్థానిక సమాజంలో శాంతి, భద్రత పెంచే దిశగా పెద్ద ముందడుగు అని పోలీసులు అభివర్ణించారు. దర్యాప్తు కొనసాగుతున్న సమయంలో మిగిలిన సహచరుల గుర్తింపు కోసం పోలీసు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

# బాలాపూర్ లడ్డూ @రూ.35 లక్షలు

- గతేడాది కంటే రూ.4.99లక్షలు అధికం
- దక్కించుకున్న లింగాల దశరథ్ గౌడ్

**హైదరాబాద్ సెప్టెంబర్ 06(ప్రజాస్వరం):**

గణేశ్ ఉత్సవాల్లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన బాలాపూర్ గణేశ్ లడ్డూను ఈసారి కర్మాన్‌ఘాట్‌కు చెందిన లింగాల దశరథ్ గౌడ్ దక్కించుకున్నారు. శనివారం జరిగిన వేలంలో ఈ లడ్డూ రికార్డు స్థాయిలో రూ. 35 లక్షల ధర పలికింది. గత ఏడాది బాలాపూర్ లడ్డూ వేలంలో రూ.30 లక్షల వెయ్యి పలికింది. ఈసారి దాని ధర రూ.4.99 లక్షలకు పైగా పెరిగి రూ.35 లక్షలకు చేరడం విశేషం. ఈ లడ్డూను సొంతం చేసుకోవడానికి దశరథ్ గౌడ్ పదేళ్లుగా ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. బాలాపూర్ లడ్డూను దక్కించుకోవడం తనకు ఎంతో సంతోషాన్నిచ్చిందని, భగవంతుడి ఆశీస్సులు లభించాయని అన్నారు. ఈ మొత్తం డబ్బును సామాజిక కార్యక్రమాలకు వెచ్చిస్తానని తెలిపారు. ఈ లడ్డూ వేలానికి భారీ సంఖ్యలో భక్తులు, స్థానిక నాయకులు తరలివచ్చారు.



కాగా, 1994లో ఈ బాలాపూర్ లడ్డూ వేల పాట ప్రారంభమైంది.

# తెలంగాణలో పింఛన్లు పెంచే వరకు ఉద్యమం: మందకృష్ణ మాదిగ

**మంచిర్యాల జిల్లా సెప్టెంబర్ 06(ప్రజాస్వరం):**

తెలంగాణలో పింఛన్లు పెంచే వరకు ప్రభుత్వంపై ఉద్యమాలు చేపడుతూనే ఉంటుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. శనివారం మంచిర్యాల జిల్లా తాండూర్ మండలంలోని సుమంగళి ఫంక్షన్ హాల్‌లో చేపట్టిన మహా గర్జన సన్నాహక సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 2004లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రూ. 200కు పెంచారని , దశలవారీగా ఎమ్మార్పీఎస్ చేసిన పోరాటలతోనే 2014లో అన్ని పార్టీలు వేయి రూపాయల పెన్షన్ ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టాయని గుర్తు చేశారు. తమ పోరాటాల ఫలితంగానే ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణలో వెయ్యి రూపాయల పెన్షన్ పెంపు సాధ్యమైందన్నారు. అనంతరం 2019 ఎన్నికల్లో కూడా ఎమ్మార్పీఎస్ ఒత్తిడితోనే రూ. 2 వేల పెన్షన్ పెంపు సాధ్యమైందన్నారు 2023లో రూ. 4వేల పెన్షన్‌ను ఇస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 21 నెల లైనా ఆ ఊసే ఎత్తడం లేదని ఆరోపించారు. దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులతో ఓట్లతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం పెన్షన్ పెంపును విస్మరించడం సరికాదన్నారు. ఈ పెన్షన్ పెంపు చేపట్టే వరకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈనెల 8న జిల్లా కలెక్టరేట్ల ముట్టడి, 20న మండల తాసిల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన, హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారి దిగ్బంధంతోపాటు దశల వారి ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య, నియోజకవర్గ ఇన్‌చార్జి జిలకర శంకర్, నాయకులు గణేష్, తదితరులు ఉన్నారు.





# బై..బై..గణేశా!



మొదటిపేజీ తరువాయి

పాటు కొనసాగింది. బాలాపూర్ గణేశుడు కాస్త ఆలస్యంగా బయలుదేరినా, మధ్యాహ్నం 3 గంటల కల్లా పాతబస్తీ దాటించారు. రాత్రి 8 గంటల సమయంలో ట్యాంక్ బండ్‌లోని క్రేన్ నంబర్ 12 వద్ద బాలాపూర్ గణనాథుడు నిమజ్జనమయ్యాడు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మూడు పోలీస్ కమిషనరేట్‌ల పరిధిలో 30 వేల మంది పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. సున్నితమైన ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా దళాలను మోహరించారు. నిమజ్జనం ఉదయం నుంచే వేగవంతంగా సాగినా, సాయంత్రం 6:30 గంటల వరకు కేవలం 40 శాతం విగ్రహాలు మాత్రమే నిమజ్జనమైనట్లు పోలీసులు తెలిపారు.

**3 కంట్రోల్ రూమ్‌ల నుంచి పర్యవేక్షణ**

గణేష్ నిమజ్జనాన్ని పర్యవేక్షించేందుకు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మూడు పోలీసు కమిషనరేట్ లలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పోలీసులు, ఉన్నతాధికారులు మూడు కంట్రోల్ రూమ్‌ల నుంచి నిమజ్జన ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ పోలీసు కమాండ్ కంట్రోల్, జీహెచ్‌ఎంసీ కమాండ్ కంట్రోల్, డీజీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ల నుంచి ట్రాఫిక్ నియంత్రణ, మండపాల తరలింపుపై సూచనలు జారీ చేశారు. డీజీపీ జితేందర్ స్వయంగా క్షేత్ర స్థాయిలో పరిస్థితులను పర్యవేక్షించారు. నగర పోలీసు కమిషనర్ సి.వి. ఆనంద్ సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తూ నిమజ్జనం వేగంగా, ప్రశాంతంగా జరిగేందుకు తగిన సూచనలు ఇచ్చారు. పాతబస్తీలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి నిమజ్జన తీరును పరిశీలించారు. జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్, డీజీపీ జితేందర్, జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కలెక్టర్ హరిచందన దాసరి ఏరియల్ సర్వే నిర్వహించి, నిమజ్జన ఏర్పాట్లను సమీక్షించారు. మండప నిర్వాహకులు నిమజ్జనాన్ని త్వరగా పూర్తి చేయడానికి సహకరించాలని పొన్నం కోరారు. శనివారం వారాంతం కావడంతో నిమజ్జనాన్ని వీక్షించేందుకు భారీ సంఖ్యలో ప్రజలు వచ్చారు. సాయంత్రం 5 గంటల సమయంలో పొన్నం, మేయర్ , కలెక్టర్, పోలీస్ కమిషనర్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ మరోసారి ఏరియల్ సర్వే నిర్వహించారు.

**రెండో రోజుకు నిమజ్జనం**

గణేశ్ నిమజ్జనం ఆదివారం రెండో రోజు కూడా కొనసాగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. పాతబస్తీతో పాటు న్యూ సిటీలోని చాలా ప్రాంతాల నుంచి గణపతులు ఆలస్యంగా నిమజ్జనం కోసం బయలుదేరడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ఈసారి నగరంలో సుమారు లక్ష విగ్రహాలు ప్రతిష్ఠించారని, వాటిలో 40 వేల విగ్రహాలను హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనం చేస్తారని ప్రభుత్వం అంచనా వేసినప్పటికీ, శనివారం రాత్రి వరకు కనీసం 20 వేల విగ్రహాలు కూడా నిమజ్జనం కాలేదని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో నిమజ్జనం ఆదివారం మధ్యాహ్నం వరకు కొనసాగే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు. పాతబస్తీలోని మండపాల్లో చివరి రోజు పూజలు, అన్నదాన కార్యక్రమాల తర్వాతే శోభాయాత్రలు ప్రారంభమయ్యాయి. దీంతో బాలాపూర్ నుంచి హుస్సేన్ సాగర్ వరకు నిమజ్జన రూట్‌లో విగ్రహాలు భారీ క్యూలో నిలిచిపోయాయి. హుస్సేన్ సాగర్ చుట్టూ ఉన్న క్రేన్లు గంటకు గరిష్టంగా ఆరు విగ్రహాలను మాత్రమే నిమజ్జనం చేయగలవు, దీనివల్ల ప్రక్రియ మరింత నెమ్మదిగా సాగుతోంది. శనివారం రాత్రి వరకు క్యూలో ఉన్న విగ్రహాలను నిమజ్జనం చేయడానికి ఆదివారం మధ్యాహ్నం వరకు సమయం పట్టే అవకాశం ఉంది. గత సంవత్సరం కూడా ఇలాగే నిమజ్జనం ఆలస్యం కావడంతో ట్రాఫిక్ ఆంక్షలను మధ్యాహ్నం 3 గంటల వరకు పొడిగించారు. ఈసారి ఆదివారం ఉదయం కల్లా నిమజ్జనాన్ని పూర్తి చేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

**బడా గణేశ్ నిమజ్జనం పూర్తి**

69 అడుగుల ఎత్తు, 50 టన్నుల బరువున్న ఖైరతాబాద్ శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతి నిమజ్జనం శనివారం విజయవంతంగా పూర్తయింది. నిమజ్జన ప్రక్రియను చూసేందుకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మధ్యాహ్నం 1:03 గంటలకు నిమజ్జనం ప్రారంభమై, 1:46 గంటలకు సంపూర్ణమైంది. గణనాథుడు హుస్సేన్ సాగర్‌లో పూర్తిగా మునిగిపోవడానికి 42 నిమిషాల సమయం పట్టింది. ఈ భారీ విగ్రహాన్ని నిమజ్జనం చేయడానికి విజయవాడ నుంచి ప్రత్యేకంగా తెప్పించిన 'బాహుబలి క్రేన్'ను ఉపయోగించారు. అలాగే, ఈ క్రేన్‌ను నడపడానికి కర్నూలు నుంచి ఒక నిపుణుడైన డ్రైవర్‌ను రప్పించినట్లు సమాచారం.

**లడ్డూలకు భారీ క్రేజ్**

గణేశ్ ఉత్సవాల్లో లడ్డూల వేలం ఆకర్షణగా నిలుస్తోంది. భక్తులు భక్తిభావంతో లడ్డూలను దక్కించుకోవడానికి పోటీపడ్డారు. ఈసారి లడ్డూల వేలంలో ధరలు రికార్డు స్థాయిలో పెరిగాయి. ప్రతిష్ఠాత్మకమైన బాలాపూర్ గణేశ్ లడ్డూ ఈసారి దాదాపు రూ. 35 లక్షల ధర పలికింది. శనివారం ఉదయం నిర్వహించిన వేలంలో కర్మాన్‌ఘాట్‌కు చెందిన లింగాల దశరథ్ గౌడ్ ఈ లడ్డూను దక్కించుకున్నారు. బండ్లగూడలోని రిచ్‌మండ్ విల్లాలో 20 మందితో కూడిన ఒక గ్రూప్ ప్రతిష్ఠించిన గణేశ్ లడ్డూ ఈసారి రికార్డు స్థాయిలో రూ.2 కోట్ల 32 లక్షల ధర పలికింది. గత ఏడాది ఇదే లడ్డూ రూ. 1.87 కోట్లు పలికింది. ఈ లడ్డూ వేలంతో వచ్చిన మొత్తాన్ని పేద విద్యార్థుల చదువులకు సహాయం చేయడానికి ఉపయోగిస్తామని రిచ్‌మండ్ విల్లా గణేశ్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు. మాదాపూర్‌లోని మై హోమ్ బూజా లడ్డూ ఈసారి రూ. 51 లక్షలకు అమ్ముడైంది. ఈ లడ్డూలకు పెరుగుతున్న డిమాండ్‌తో భక్తుల ఉత్సాహం మరింత పెరిగింది.

# విజ్ఞతకే వదిలేస్తున్నా

మొదటిపేజీ తరువాయి




వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని అన్నారు. శనివారం నాడు లండన్ నుంచి హైదరాబాద్‌కు తిరిగి వచ్చిన సందర్భంగా శంషాబాద్ ఎయిర్‌పోర్టులో మీడియాతో మాట్లాడుతూ కవిత వ్యాఖ్యలపై, రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితులపైనా స్పందించారు. 'నా 25 ఏళ్ల రాజకీయ ప్రస్థానం తెలంగాణ ప్రజల ముందు తెరిచిన పుస్తకం లాంటిది' అని హరీశ్ చెప్పారు. కేసీఆర్ నాయకత్వంలో గత రెండున్నర దశాబ్దాల కాలంగా ఒక క్రమశిక్షణ గల కార్యకర్తగా, తెలంగాణ రాష్ట్ర సాధనలో, రాష్ట్ర అభివృద్ధిలో తాను చూపిన నిబద్ధత, తన పాత్ర అందరికీ తెలుసన్నారు. రాష్ట్రంలో ఎరువులు దొరకక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, మరోవైపు వరద ప్రాంతాల ప్రజలు అనేక కష్టాలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**పోరాటం కొనసాగిస్తాం**

కేసీఆర్ దశాబ్దకాలం కష్టపడి నిర్మించిన ఒక్కొక్క వ్యవస్థను ఉద్దేశపూర్వకంగా ఈ ప్రభుత్వం నాశనం చేస్తోందని ఆరోపించారు. ఇటువంటి పరిస్థితుల్లో కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకునే విషయంలో, అలాగే తెలంగాణ ద్రోహుల నుంచి రాష్ట్రాన్ని కాపాడుకునే విషయంలో తమ దృష్టి అంతా ఉంటుందని హరీశ్ స్పష్టం చేశారు. 'తెలంగాణ రాష్ట్ర సాధనలో పోరాటం చేసిన వాళ్లం. ఈ రాష్ట్రాన్ని కాపాడుకునే బాధ్యత కలిగిన వాళ్లం. మా సమయాన్ని అంతా దానిమీదనే వెచ్చిస్తాం' అని ఎమ్మెల్యే అన్నారు. తప్పకుండా కేసీఆర్ నాయకత్వంలో తిరిగి అధికారంలోకి వచ్చి ప్రజల కష్టాలను తొలగించడానికి అందరం కలిసికట్టుగా ముందుకు సాగుతామని హరీశ్ ధీమా వ్యక్తం చేశారు.

# ఎర్రకోటలో భారీ చోరీ

- జైన్ గురువు వేషంలో వచ్చి..
- బంగారం, వజ్రాల దొంగతనం
- దేశవ్యాప్తంగా సంచలనంగా ఘటన

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 06(ప్రజాస్వరం):**

దేశ రాజధాని ఢిల్లీలోని ప్రఖ్యాత ఎర్రకోట ప్రాంగణంలో జరుగుతున్న జైనమత కార్యక్రమంలో భారీ దొంగతనం జరిగింది. జైన్ గురువు వేషధారణలో వచ్చిన ఒక దొంగ ఏకంగా రూ.1.5 కోట్ల విలువైన రెండు బంగారు కలశాలు, వజ్రాలు, ఇతర విలువైన వస్తువులను చోరీ చేశాడు. ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. పోలీసులు కేసు నమోదు చేసి సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా దొంగను గుర్తించారు. దొంగిలించబడిన వస్తువులలో 760 గ్రాముల బరువున్న పెద్ద బంగారు కలశం, బంగారు కొబ్బరికాయ, 115 గ్రాముల చిన్న బంగారు కలశం, కొన్ని వజ్రాలు, మరకత మణి, ఒక విలువైన రత్నం ఉన్నాయి. ఇవన్నీ జైన మతంలో పవిత్రమైన పూజా సామగ్రిగా పరిగణిస్తారు. వీటిని సుధీర్ జైన్ అనే వ్యాపారి ప్రతిరోజూ పూజల కోసం తీసుకొచ్చి, తీసుకెళుతుంటారు.

**గురువు వేషంలో వచ్చి..**

బుధవారం, 'దశలక్షణ మహాపర్వ్' కార్యక్రమం సందర్భంగా జనాల రద్దీ ఎక్కువగా ఉన్న సమయంలో ఈ దొంగతనం జరిగింది. నిర్వాహకులు ప్రముఖ అతిథులను స్వాగతించడంలో బిజీగా ఉండగా, దొంగ ఈ అవకాశాన్ని ఉపయోగించుకున్నాడు. సీసీటీవీ ఫుటేజీలో దొంగ జైన గురువు వేషంలో వచ్చి, దొంగిలించిన వస్తువులను ఒక సంచిలో వేసుకొని వెళ్లడం కనిపించింది. సుధీర్ జైన్‌కు చెందిన పునీత్ జైన్ మాట్లాడుతూ గతంలో కూడా ఈ దొంగ మూడు ఆలయాల్లో చోరీకి ప్రయత్నించాడని తెలిపారు. ఈ దొంగతనంపై సుధీర్ జైన్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ, బంగారు కలశం లాంటి వస్తువులకు విలువ కట్టలేమని, అది తమ భావోద్వేగాలతో ముడిపడి ఉన్నదని అన్నారు. పోలీసులు త్వరలోనే నిందితుడిని అరెస్ట్ చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మతపరమైన ఉత్సవం సెప్టెంబర్ 9 వరకు ఎర్రకోటలోని పార్కులో కొనసాగుతుంది.



# సంస్కృతి సంరక్షణ

- రాబోయే తరాలకు సంస్కృతిని అందించాలి
- కశ్మీర్ నుంచి కన్యాకుమారి..
- వరకు ఐక్యతతో ఉండాలి
- బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్

**హైదరాబాద్ సెప్టెంబర్ 06(ప్రజాస్వరం):**



గణేష్ ఉత్సవ కమిటీ ఆనాడు వేల మందితో మొదలైందని, ఇప్పుడు కోట్ల మంది ప్రజలతో హిందూ పండుగలు జరుపుకుంటున్నారని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ చెప్పారు. గొప్ప సంస్కృతి సాంప్రదాయాలను రాబోయే తరాలకు అందించడానికి ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారని తెలిపారు. శనివారం నాడు ఆయన చార్మినార్‌లోని భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆ తర్వాత భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న శోభాయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ, 46 ఏళ్ల క్రితం హైదరాబాద్‌లో భాగ్యనగర గణేశ్ ఉత్సవ కమిటీ కేవలం వేల మంది ప్రజలు, పూజలతో మొదలైందని గుర్తు చేసుకున్నారు. ఇప్పుడు హైదరాబాద్‌లోనే కాకుండా, ప్రతి గ్రామంలో, బస్తీలో గణేశ్ ఉత్సవ కమిటీల నాయకత్వంలో మండపాలు స్థాపించి, 9 రోజుల పాటు ఆ ప్రాంతాల ప్రజలు కుటుంబ సభ్యుల్లా పూజలు నిర్వహిస్తున్నారని చెప్పారు. మోదీ నాయకత్వంలో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అందరూ భారతమాత ముద్దుబిడ్డలమనే ఐక్యత, చైతన్యం సంతరించుకుంటోందని ఈటల వ్యాఖ్యానించారు. ఈ ఐక్యత, ఉత్సవాలు ఇలానే కొనసాగాలని రాజేందర్ ఆకాంక్షించారు.



## మహిళలు నచ్చిన రంగాల్లో నైపుణ్యాన్ని పెంచుకొని ఆర్థికంగా ఎదగాలి

- **శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్**

**వికారాబాద్, సెప్టెంబర్ 6(ప్రజా స్వరం ):**

మహిళలు తమకు నచ్చిన రంగాల్లో తమ నైపుణ్యాన్ని పెంచుకొని ఆర్థికంగా ఎదగాలని శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎస్సీ కార్పొరేషన్ సహకారంతో స్ఫూర్తి గ్రామీణ అభివృద్ధి సంస్థ వారి సౌజన్యంతో ఉచిత శిక్షణ పూర్తి చేసుకున్న ఎస్సీ మహిళకు ఉచిత కుట్టు మిషన్లు, సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సభాపతి మహిళను ఉద్దేశించి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారత నిమిత్తం వివిధ రంగాల్లో మహిళల ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటునందిస్తుందన్నారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో 35 మంది మహిళలకు 90 రోజుల పాటు కుట్టు మిషన్ లో శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ లు పంపిణీ చేయడం సంతోషదాయకమన్నారు. కుట్టుమిషన్ల శిక్షణ పొందిన మహిళలు తమ కుటుంబాలకు ఆర్థిక తోడ్పడుకు ఎంతగానో దోహద పడుతుందన్నారు. కుట్టు మిషన్ లో నైపుణ్య శిక్షణ పొందిన మహిళల ఆర్థిక అభివృద్ధికి వివిధ సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పించే బాధ్యతను ఎస్సీ కార్పొరేషన్ అధికారులు తీసుకోవాలని స్పీకర్ సూచించారు. చదువుతోపాటు మహిళల్లో ఉపాధి కల్పనకు గాను ఉచిత నైపుణ్య శిక్షణలను ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. నైపుణ్య శిక్షణలను సద్వినియోగం చేసుకొని గ్రామీణ ప్రాంత యువతను కూడా ప్రోత్సహించాలని ఆయన సూచించారు. గ్రామీణ ప్రాంతాల కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకునే విధంగా మరిన్ని ఉచిత శిక్షణ కేంద్రాలను నిర్వహించేందుకు తల వంతు సహకారం అందిస్తానని స్పీకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎం.సుధీర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబు మోజెస్, ఆర్టిఏ సభ్యులు జాఫర్, స్ఫూర్తి గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ రెడ్డి, టెక్నికల్ ట్రైనింగ్ ఇంచార్జ్ ప్రసన్న లు తదితరులు పాల్గొన్నారు.



## మేడ్చల్ టు ఈసీఐఎల్ కు సర్వీస్ ను ప్రారంభించిన డిపో మేనేజర్ భవభూతి.



**శామీర్ పేట సెప్టెంబర్ 6(ప్రజాస్వరం)**




హకీంపేట్ డిపో బస్సులుమొట్టమొదటిసారిగా మేడ్చల్ నుండి ఈసీఐఎల్ 22E/229 రూట్ లో నాలుగు(4) కొత్త సర్వీస్ లనుశనివారం డిపో మేనేజర్ భవభూతి ప్రారంభించారు. సోమవారం నుంచి ప్రతి 40 నిమిషాలకు ఒక బస్సు నడుస్తుందని మేడ్చల్ , కొంపల్లి, బొల్లారం రైల్వే స్టేషన్, రిసాల బజార్, కాకూర్ చౌరస్తా, ఎంబి దర్గా, యాప్రాల్ , అమ్ముగూడ, ఏఎస్ రావు నగర్ మీదుగా ఈ సి ఐ ఎల్ బస్టాండ్ వరకు నడుపుతున్నట్లు హకీంపేట్ డిపో మేనేజర్ భవభూతి తెలిపారు. ఈ రూట్లో ప్రయాణించే ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా తెలిజేశారు. ఉదయం 5 గంటల నుండి రాత్రి పది గంటల వరకు ప్రతి 40 నిమిషాలకు ఒక బస్సు నడుస్తుందని తెలిపారు.

## భక్తి శ్రద్ధలతో కుంకుమార్చన.......

- **ప్రత్యేక పూజలు చేసిన మాజీ కౌన్సిలర్ ఎద్దు లక్ష్మి నగేష్ యాదవ్**

**శామీర్ పేట సెప్టెంబర్6 (ప్రజాస్వరం):**

తూముకుంట మున్సిపాలిటీ పరిధిలోని ఎంఎం రెడ్డి కాలనీలో శుక్రవారం రాత్రి గణపతి పూజతో పాటు పెద్ద ఎత్తున మహిళలతోకుంకుమార్చన నిర్వహించారు.ప్రతి రోజు నిర్వహించే విశేష గణపతి పూజతో పాటు మహిళల కోరిక మేరకు ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఎద్దు లక్ష్మి నాగేష్ యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.





# కార్మికుల హక్కులను పెట్టుబడి దారులకు కట్టబేడుతున్న కేంద్రం...







- **లేబర్ కోడ్స్ అమలుకు వ్యతిరేకంగా ఉద్యమం...**
- **డిసెంబర్ 7, 9 న మెదక్ లో రాష్ట్ర 5వ మహాసభలు...**
- **సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు....**


**మెదక్ సెప్టెంబర్ 06 (ప్రజా స్వరం)**

కార్మికుల హక్కులను పెట్టుబడి దారులకు కట్టబేడుతున్న కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకంగా ఉదయం చేస్తామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు పేర్కొన్నారు. శనివారం మెదక్ జిల్లా కేంద్రంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు బాలమణి అధ్యక్షతన జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి సీఐటీయూ రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం చైర్మన్ చుక్క రాములు ముఖ్య అతిథిగా హాజరైయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తున్న సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర 5 వ మహాసభలు డిసెంబర్ 7, 9 న మొదటి సారిగా మెదక్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తుంగలో తొక్కుంతుందని అన్నారు. కార్మిక చట్టాలను మర్చి పెట్టుబడిదారులకు ఊడిగం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందని అన్నారు. మెదక్ జిల్లాలో మొదటి సారిగా సీఐటీయూ రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మహాసభల జయప్రదం కోసం జిల్లా ప్రజానీకం, కార్మికులు, ఉద్యోగులు, శ్రేయోభిలాషులు సహాయ సహకారాలు అందించాలని కోరారు. అంగన్వాడి, ఆశ, గ్రామపంచాయతీ, మున్సిపల్, మధ్యాహ్న భోజనం రంగం లతో పాటు ఇతర రంగాల కార్మికులకు అనేక రకాల పనులు చేయిస్తూ పని భారాన్ని పెంచుతూ, సరైన సమయంలో వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే పెండింగ్లో ఉన్న వేతనాలను చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు జే. మల్లికార్జున్, ఆడివయ్య ఎన్పిఆర్డి రాష్ట్ర కార్యదర్శి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏ. మల్లేష్, జిల్లా ఉపాధ్యక్షులు ఏ. మహేందర్ రెడ్డి, కోశాధికారి నర్సమ్మ, జాభిన బేగం, వ్యవసాయ కార్మిక సంగం జిల్లా కార్యదర్శి కె. మల్లేష్ మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు

## భారీ వర్షా లకు విద్యుత్తు సరఫరాలో ఇబ్బందులు లేకుండా పునరుద్ధరణ...

- **భారీ వర్షాలకు విద్యుత్తు సరఫరాలో ఇబ్బందులు లేకుండా పునరుద్ధరణ...**
- **రెండు మూడు రోజుల్లో ఇబ్బందులు ఉన్న అగ్రికల్చర్ కరెంట్ సరఫరా**
- **మెదక్ పిల్లికొట్టాల్ సబ్ స్టేషన్‌కు దుర్గా కాలనీ ఆవరణలో స్థలం కేటాయింపు**
- **వర్షాలు, వరదల్లో అధికారులు, సిబ్బంది సేవలు అభినందనీయం**
- **టీజీఎస్‌సీపీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్ బాలస్వామి**


**మెదక్ సెప్టెంబర్ 06 (ప్రజా స్వరం)**



జిల్లా వ్యాప్తంగా గత నెలలో నాలుగు రోజుల పాటు భారీ వర్షాల కారణంగా విద్యుత్తు సరఫరాలో అధికారులు, సిబ్బంది నిరంతరం శ్రమించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పునరుద్ధరుణ చర్యలు చేపట్టారని ఈ విషయంలో వారు వర్షాన్ని సైతం లెక్క చేయకుండా విధులు నిర్వర్తించడం అభినందనీయమని పదకొండు ఉమ్మడి జిల్లాలకు చెందిన టీజీఎస్‌సీపీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్ బాలస్వామి అన్నారు. శనివారం జిల్లా కేంద్రమైన మెదక్ పట్టణంలోని ఎస్‌ఈ కార్యాలయంలో విద్యుత్తు శాఖ జిల్లా ఎస్‌ఈ నారాయణ నాయక్, అధికారులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్ ఇంజనీర్ బాలస్వామి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఆగస్టు 26వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో జిల్లా పరిధిలో మొత్తం 115 గ్రామాలకు విద్యుత్తు సరఫరా నిలిచిపోగా అధికార యంత్రాంగం వెంటనే స్పందించి ఇరవై నాలుగు గంటల్లోపే 110 గ్రామాలకు విద్యుత్తును పునరుద్ధరించారని తెలిపారు. ఈ విషయంలో ఎస్‌ఈ స్థాయి నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు తమ బాధ్యతలను నిర్వర్తించారని కొనియాడారు. అలాగే ఇరవై నాలుగు గంటల్లోనే 259 స్తంభాలు, 14 విద్యుత్తు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చడంతో పాటు 11 కిలోమీటర్ల మేర లైన్లు వేసినట్లు చీఫ్ ఇంజనీర్ బాలస్వామి వివరించారు. ఈ భారీ వర్షాలు, వరదల వల్ల వ్యవసాయ సరఫరాలో కొంత ఇబ్బందులు తలెత్తాయని వాటిని సైతం వెంటనే సరి చేశామని... అలాగే ప్రస్తుతం వ్యవసాయానికి సంబంధించి మరికొన్ని చోట్ల విద్యుత్తు పునరుద్ధరణ జరగాల్సి ఉందని వీటిని సైతం రెండు మూడు రోజుల్లో పూర్తి స్థాయిలో పూర్తి చేయాల్సిందిగా ఇప్పటికే అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించినట్లు... దీనికి గాను ప్రత్యేకంగా డీఈ స్థాయి అధికారులతో టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ విషయంలో తమ శాఖ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ సూచనలు, సలహాలు పాటిస్తూనే ఎప్పటికప్పుడు చేపట్టిన పనులను వారి దృష్టికి తీసుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. మెదక్ పట్టణంలో నీట మునిగిన పిల్లికొట్టాల్ సబ్‌స్టేషన్‌కు ప్రస్తుతం తాత్కాలికంగా రాజ్‌పల్లి సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్తు సరఫరా జరుగుతోందని... దీనికి సంబంధించి పిల్లికొట్టాల్ సబ్‌స్టేషన్‌ను మార్చాల్సిందిగా రాష్ట్ర ముఖ్యమంత్రి సూచనలతో ప్రభుత్వ పర్యవేక్షణలో మార్చడం జరుగుతుందని దీనికి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పట్టణంలోని దుర్గాకాలనీ సమీపంలో సుమారు ఎకరా స్థలాన్ని కేటాయించారని.. అందుకు సంబంధించి అలాట్‌మెంట్ రాగానే పనులు ప్రారంభించి పూర్తి చేయడం జరుగుతుందని చీఫ్ ఇంజనీర్ బాలస్వామి స్పష్టం చేశారు. అలాగే జిల్లాలో ఇప్పటికీ ఎక్కడైనా వ్యవసాయ విద్యుత్తుకు సంబంధించి ఇబ్బందులు ఉంటే వాటిని సరి చేయడానికి ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు వారి పర్యవేక్షణలో రెండు మూడు రోజుల్లో పూర్తి స్థాయిలో విద్యుత్తు పునరుద్ధరణ జరుగుతుందని తెలిపారు. ఈ విషయంలో పొలాలు, బోరుబావుల వద్దకు వెళ్ళలేని పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో కొంత ఆలస్యం జరిగిందని దీనిని దృష్టిలో ఉంచుకొని మూడు ప్రత్యేక బృందాలతో విద్యుత్తు పునరుద్ధరణ పనులు పూర్తి చేయడం జరుగుతుందని దీనికి సంబంధించి యాక్షన్ ప్లాన్ రూపొందించామని తెలిపారు. అలాగే హవేళీ ఘనపూర్ మండలానికి టెక్నికల్ డీఈ శ్రీనివాస్ విజయ్, మెదక్‌కు డీపీఈ శ్రీనివాస్ రెడ్డి, పాపన్నపేట మండలానికి మెదక్ డీఈ చాంద్ బాషాల ఆధ్వర్యంలో ఆయా టీమ్‌లు పని చేస్తాయని రెండుమూడు రోజుల్లో యధావిధిగా అగ్రికల్చర్ కరెంట్ సైతం సరఫరా చేయడం జరుగుతుందని చీఫ్ ఇంజనీర్ బాలస్వామి తెలిపారు. అలాగే రాబోయే రోజుల్లో ఇలాంటి బీభత్సాలను సైతం ఎదుర్కొనేందుకు పట్టణంలోని హల్దీవాగు, పసుపులేరు, గంగమ్మ ఆలయం వాగు, మంజీరా వాగులతో పాటు ఎనిమిది ప్రాంతాల్లో 25 ప్రత్యేక టవర్లను ఏర్పాటు చేయడం జరుగుతుందని వివరించారు. ప్రస్తుతం జిల్లాలో 6.09 మిలియన్ యూనిట్లు (ఆరు లక్షల యూనిట్ల) విద్యుత్తు వినియోగమవుతందని అందుకు సరిపోను అందచేస్తున్నామని... అలాగే జిల్లాలోని మీర్జాపల్లి, చల్మెడలో సబ్‌స్టేషన్‌లు పూర్తయ్యాయని త్వరలోనే ప్రారంభించడం జరుగుతుందన్నారు. భారీ వర్షాలు, వరదల వల్ల 39 ఫీడర్లలో 9 దెబ్బతినగా అందులో 7 సరి చేయగా... మరో రెండు ఫీడర్లు కాలువల్లో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటం వల్ల పునరుద్ధరించలేక పోయినా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు... ఈ సమయంలో మెదక్ సర్కిల్ 460 డీటీఆర్‌లు ప్రభావితమవగా... 16 పూర్తిగా కొట్టుకుపోయాయని... 1,3,44 స్తంభాలు దెబ్బతిన్నాయని సుమారు రూ.13.5 కోట్లు నష్టం జరిగినట్లు చీఫ్ ఇంజనీర్ బాలస్వామి తెలిపారు. జిల్లాలో విద్యుత్తు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఏమైనా ఇబ్బందులు తలెత్తినట్లయితే 87124-73356 నెంబర్‌కు ఫోన్ చేయాలని చీఫ్ ఇంజనీర్ బాలస్వామి సూచించారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా వర్షాలకు దెబ్బతిన్న సబ్‌స్టేషన్లు, నూతనంగా నిర్మించనున్న సబ్‌స్టేషన్లతో పాటు ఆయా ప్రాంతాలను పరిశీలించారు. ఈ సమావేశంలో మెదక్ ఎస్‌ఈ నారాయణ నాయక్, మెదక్, తూప్రాన్ డీఈలు చాంద్‌బాషా, గరుత్మంతరాజు, టెక్నికల్ డీఈ శ్రీనివాస్ విజయ్, ఏడీఈ మోహన్ బాబు, ఏఈ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- **ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి**







**తాండూరు, సెప్టెంబర్ 6(ప్రజా స్వరం):**

పేదల సంక్షేమానికి వారి ఆరోగ్యానికి రాష్ట్ర కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేస్తుందని తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అన్నారు. శనివారం తాండూరు నియోజకవర్గానికి సంబంధించిన పలువురు పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను, కల్యాణ లక్ష్మి చెక్కులను క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందించారు. 119 మంది పేదలకు రూ.39,79,000/ విలువగల సి ఎం ఆర్ ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి లబ్ధిదారులకు అందించారు. 96 మంది లబ్ధిదారులకు రూ. 96,11,136/ విలువగల కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పంపిణీ చేశారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందిన తాండూరు నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలకు చెందిన 119 మంది లబ్ధిదారులకు దాదాపు రూ. 39,79,000/ విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను తాండూరు నియోజకవర్గం లోని పెద్దేముల్, తాండూరు, బషీరాబాద్ మండలాలకు చెందిన 96 మంది లబ్ధిదారులకు రూ.96,11,136/ విలువ గల కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను స్థానిక నాయకులతో కలిసి చెక్కులను తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పంపిణీ చేశారు.

# సందర్భం ఏదైనా అంజయ్యనే టార్గెట్

- అభివృద్ధిని మరిచి ఆరోపణలకే ప్రాధాన్యం
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అర్థం లేని ఆరోపణలు మానుకోవాలి
- అంజయ్య యాదవ్ అవినీతికి పాల్పడినట్లు నిరూపిస్తే షాద్ నగర్ చౌరస్తాలో ముక్కు భూమికి రాస్తాం
- కుక్కలా మొరుగుతున్నది ఏ పార్టీ నేతలో ప్రజలు గమనిస్తున్నారు
- ఆంధ్ర, రాయలసీమ సంస్కృతిని ఇక్కడి ప్రజలపై రుద్దేందుకు తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు
- మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడిన అంశాలపై కనీస అవగాహన లేకుండా కౌంటర్ ఇచ్చారు
- గ్రామంలో ప్రభుత్వ భూమిని తీసుకున్నారని ఆరోపణలు చేసిన నేతలు నిజమని నిరూపిస్తారా?
- మీ నాయకుడు ఆరోపణలు చేశాడు కాబట్టి మా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ స్పందించారు
- నాడు, నేడు ఏనాటికైనా అవినీతి అక్రమాలపై విచారణకు సిద్ధం
- విచారణ చేపట్టేందుకు సమయం, సందర్భం ఎందుకు?
- మీడియా సమావేశంలో షాద్ నగర్ బీఆర్ఎస్ నేతలు



**ప్రజాస్వరం, రంగారెడ్డి జిల్లా(సెప్టెంబర్ 06):**

సందర్భం ఏదైనా, వేదిక ఎక్కడైనా మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ టార్గెట్ గా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతారని, అధికారంలో ఉన్నామనే భావనను మర్చిపోయి, అభివృద్ధి చేయాలనే ధ్యాసను వదిలిపెట్టి అంజయ్య యాదవ్ ను టార్గెట్ చేస్తే నియోజకవర్గ ప్రజలకు ఏమి ప్రయోజనమని జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఈట గణేష్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎం.ఎస్ నటరాజ్, మాజీ కౌన్సిలర్ బచ్చలి నరసింహులు ప్రశ్నించారు. గత మూడు రోజుల క్రితం స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు చేసిన విషయమై మా నాయకుడు మాట్లాడితే , ఆయన చెప్పిన అంశాలను ప్రస్తావించకుండా అర్థంలేని ఆరోపణలు చేయడం కాంగ్రెస్ నేతలకు చెల్లిందని మండిపడ్డారు. సమావేశాల్లో, వేదికల పైన నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల ప్రయోజనాలపై మాట్లాడలే తప్పా, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ గారిని లక్ష్యంగా చేసుకొని విమర్శలు చేయడం సరికాదన్నారు. పదేపదే అవినీతికి పాల్పడ్డారంటూ ఆరోపణలు చేస్తున్న నేతలు అవినీతి జరిగిందని రూపిస్తే షాద్ నగర్ చౌరస్తాలో వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం ముందు ముక్కును భూమికి రాస్తామని సవాలు విసిరారు. సుద్దపూసలైతే మూడోసారి ఎందుకు గెలవలేదని ప్రశ్నించిన నేతలు మీ పార్టీలో కూడా మహానేతలు మూడోసారి గెలవలేదని విషయాన్ని గ్రహించాలని చురకలాంటించారు. బీఆర్ఎస్ నేతలు కుక్కల్లా మొరుగుతున్నారని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని, కుక్కల్లా మొరుగుతున్నది ఏ పార్టీ నేతలు ప్రజలు గ్రహిస్తున్నారని దుయ్యబట్టారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం అంటే నియోజకవర్గ ప్రజల అభివృద్ధికి వేదికగా ఉండాలని, గతంలో ఎమ్మెల్యే తప్పా, ఏ పార్టీ నేతలు కూడా ప్రెస్ మీట్ లు పెట్టి, రాజకీయ ప్రసంగాలు చేసిన సందర్భాలు లేవని గుర్తు చేశారు. అలాంటి క్యాంపు కార్యాలయాన్ని కాంగ్రెస్ నేతలు తమ గెస్ట్ హౌస్ గా వినియోగిస్తుండడం బాధాకరమని చెప్పారు. మన ప్రాంతంలో ఎన్నడు లేని విధంగా విష రాజకీయ సంస్కృతిని అలవాటు చేస్తున్నారని, రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేస్తూ రాయలసీమ, ఆంధ్ర ప్రాంత తరహాలో రాజకీయాలు చేసేందుకు తాపత్రయపడడం దురదృష్టకరమన్నారు. గత ప్రభుత్వంలో చేసిన అభివృద్ధిని జీవోలతో, ప్రొసీడింగ్లతో సహా మీడియా ముఖంగా చెప్పిన నేటికీ తప్పుడు ఆరోపణలు చేయడం కాంగ్రెస్ నాయకులకే చెల్లిందని దుయ్యబట్టారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ గ్రామంలో ప్రభుత్వ భూమిని కాజేశారాని తప్పుడు ప్రచారాలు చేయడం సిగ్గుచేటని, ఒకవేళ మీ వద్ద ప్రభుత్వ భూమి అక్రమంగా తీసుకున్నారని ఆధారాలు ఉంటే నిరూపించాలని కోరారు.

నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సాధించవలసిన నేతలు, ప్రజా ప్రతినిధులు వ్యక్తిగత విమర్శలకు దిగుతూ దిగజారుడు రాజకీయాలకు పాల్పడడం భావ్యం కాదని విమర్శించారు. నియోజకవర్గ అభివృద్ధికి బీఆర్ఎస్ శ్రేణులు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నారని, నియోజకవర్గ ప్రగతి పై దృష్టి సాధించాలని సూచించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్, నేతలు చీపిరి రవి యాదవ్, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మొహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలో పాల్గొన్న పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర

- పలువురు ముస్లిము సోదరులకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే



**మన్యం జిల్లా : సెప్టెంబర్ 6 (ప్రజాస్వరం)**

ముస్లిము సోదరులకు ఎంతో ప్రధాన్యత గల ఈద్ మీలాదుల్ నబీ (మొహమ్మద్ ప్రవక్త వారి జన్మదిన వేడుక)లో పార్వతీపురం శాసన సభ్యులు బోనెల విజయచంద్ర పాల్గొన్నారు. పార్వతీపురం పాలకొండ రోడ్ లో గల జామియా మస్జీద్ వద్ద ముస్లిం సోదరులతో కలిసి పాల్గొని ప్రత్యేక నమాజు కార్యక్రమాన్ని నిర్వహించారు. మీలాదుల్ నబీ సందర్భంగా ముస్లిం సోదరులందరికీ ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తర్కి లాంటి దేశంలో ఈద్ మీలాదుల్ నబీ వేడుకలు ఘనంగా జరుపుకుంటారని, అదే మాదిరి మన దేశంలో అనేక చోట్ల ఈ వేడుకలు జరుగుతాయని, మన పార్వతీపురంలో కూడా ఇంత ఘనంగా జరగటం చాలా సంతోషం కలిగిందని, అందులో నేను పాలు పంచు కోవటం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే అన్నారు. అల్లా ఆశీస్సులు మనఅందరి మీద ఉంటాయని అన్నారు. భారతదేశం సెక్యూలరిజం కలిగిన దేశం అని, అందరం కలిసికట్టుగా సోదరాభావంతో కలిసి మెలిసి జీవిస్తున్నామని అన్నారు. నేను అనేక దర్గాలు, మస్జీద్లు సందర్శించి నమాజ్ కార్యక్రమాల్లో పాల్గొన్నానని అన్నారు. ప్రవక్త చూపించిన శాంతి, సన్మార్గంలో నడుచుకోవాలని సూచించారు. అలాగే ఎమ్మెల్యే తో పాటు టిడిపి పెద్దలు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు, నాయకులకు, కార్యకర్తలకు ముస్లిం కమ్యూనిటీ జిల్లా ప్రెసిడెంట్ సయ్యద్ ఇబ్రహిం, కుల పెద్దలు, కమిటీ సభ్యులు, ముస్లిం సోదరులు ధన్యవాదములు తెలియచేశారు.



## ప్రజలు కోసమే ప్రజా దర్బార్

- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి

**మన్యం జిల్లా సెప్టెంబర్ 6 (ప్రజాస్వరం)**

ప్రజా సమస్యలు తెలుసుకుని ఆ సమస్యలు పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్ మరియు కురుపాం శాసనసభ్యురాలు శ్రీమతి తోయకజగదీశ్వరిఅన్నారు. శనివారం నాడు క్యాంప్ కార్యాలయం గుమ్మలక్ష్మీపురంలో ప్రజా దర్బార్ నిర్వహించడం జరిగింది. ఈ ప్రజా దర్బార్ కు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుండి ప్రజలు వచ్చి మంచినీటి, రోడ్డు సౌకర్యం, భూసమస్య, ముఖ్యమంత్రి సహాయ నిధి తదితర సమస్యలు తెలుపుతూ వినతి పత్రాలు ఇవ్వడం జరిగింది. సమస్యలు విన్న ఎమ్మెల్యే సమస్యల గురించి సంబంధిత అధికారులకు తెలియజేస్తూ సమస్యలు వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎంసి చైర్ పర్సన్ కద్రక కళావతి, నాయకులు దొంకాడ రామకృష్ణ, కోలా రంజిత్ కుమార్, మరడాన తవిటి నాయుడు, గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండల పార్టీ అధ్యక్షులు అడ్డాకుల నరేష్, కె.వి.కొండయ్య, చైర్మన్లు, డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్ సంఘం భవన నిర్మాణానికి స్థలం కేటాయింపు

**పరిగి, సెప్టెంబర్ 5(ప్రజా స్వరం):**

ఎన్నికల సమయంలో ముదిరాజ్ సోదరులకు ముదిరాజ్ సంఘం భవన నిర్మాణానికి స్థలం కేటాయిస్తానని ఇచ్చిన హామీ మేరకు పరిగి ఎమ్మెల్యే , డి.సి.సి అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి పరిగి మండలం రంగాపూర్ వద్ద ఒక ఎకరా స్థలాన్ని ముదిరాజ్ భవన నిర్మాణానికి కేటాయించారు.

ఈ సందర్భంగా పరిగి నియోజకవర్గంలోని పలు మండలాల ముదిరాజ్ సంఘం సోదరులు ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డినీ కలిసి కృతజ్ఞతలు తెలుపుతూ శాలువాలతో ఘన సన్మానం చేశారు.ఎమ్మెల్యే వాగ్దానం అమలు కావడంతో ముదిరాజ్ సోదరుల్లో ఆనందం వెల్లివిరిసింది.



## బాస్పల్లిలో గణపతి నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

**పరిగి సెప్టెంబర్ 6 (ప్రజాస్వరం):**



పరిగి నియోజకవర్గం దోమ మండలంలోని బాస్పల్లి గ్రామంలో శని వారం గణపతి నవ రాత్రుల ఉత్సవాల ముగింపు సందర్భంగా నిమజ్జన కార్యక్రమంలో పరిగి ఎమ్మెల్యే , డి.సి.సి అధ్యక్షులు టి.రామ్మోహన్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్థులు ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ని ఘనంగా సన్మానించారు.



## వినాయక శోభాయాత్ర లో ఆర్డీవో రమాదేవి..

**మెదక్ సెప్టెంబర్ 06 (ప్రజా స్వరం)**

ఆ గణనాథుని దివ్యాను గ్రహంతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని మెదక్ ఆర్డీవో రమాదేవి తెలిపారు. శనివారం మెదక్ జిల్లా కేంద్రం రాందాస్ చౌరస్తా వద్ద వినాయక నిమజ్జన శోభాయాత్రలో మెదక్ తాసిల్దార్ లక్ష్మణ్ బాబు, ఆర్ ఐ లక్ష్మణ్ కలిసి ఆర్డీవో రమాదేవి పాల్గొన్నారు. ఆ గణనాథుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈ సందర్భంగా మెదక్ ఆర్డీవో రమాదేవి మాట్లాడుతూ ఆ విఘ్నేశ్వరుని కృపా కటాక్షాలతో ప్రజలందరూ సుఖ శాంతులతో ఉండాలని కోరుకున్నట్లు వివరించారు. శాంతి భద్రతలు, ఎంతో శ్రద్ధా భక్తితో ఈ పదకొండు రోజూలు ఎంతో ఘనంగా గణేషుడికి పూజలు నిర్వహించారని, ఆయా అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా కొనసాగుతున్నదని, నిమజ్జన శోభాయాత్ర కూడా అలాగే జరగాలని ఆన్నారు.

## నాయక నిమజ్జన ఏర్పాట్లను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి

**శామీర్ పేట సెప్టెంబర్ 6(ప్రజాస్వరం)**

శామీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల శామీర్‌పేట్ చెరువు వద్ద 11వ రోజు వినాయక నిమజ్జన ఏర్పాట్లను శనివారం సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిమజ్జనాలు సజావుగా జరిగే విధంగా అన్ని శాఖల అధికారులకు సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా రెండు ఇమర్షన్ పాయింట్ల వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తును స్వయంగా పరిశీలించారు. డీసీపీ మెడ్చల్ కోటి రెడ్డి ఐపీఎస్, డీసీసీ వెంకటేశ్వర్లు, ఏసిపి బాల గంగిరెడ్డి, వెంకట్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్‌లు శ్రీనాథ్, గురువయ్య, మధుసూదన్, రాజు తదితర సిబ్బంది హాజరయ్యారు.





## అన్నదాత పోరు పోస్టర్ ని రిలీజ్ చేసిన మన్యం జిల్లా వైసీపీ అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజ్

**మన్యం జిల్లా : సెప్టెంబర్ 6 (ప్రజాస్వరం**

ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అన్నదాతలకు యూరియా అందుబాటులో లేకుండా చేయడంపై రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రివర్యులు వైయస్ జగన్ మోహన్ రెడ్డిఆదేశాల మేరకు ఎరువుల బ్లాక్ మార్కెట్ పై అన్నదాత పోరు కార్యక్రమానికి రైతన్నకు బాసటగా వైఎస్ఆర్సిపి కార్యక్రమం ఈనెల 9వ తేదీన అనగా మంగళవారం రోజు నిర్వహించబడుతుంది.
ఈ కార్యక్రమంలో భాగంగా ఈరోజు పార్వతీపురం మన్యం జిల్లా పార్టీ అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు పోస్టర్ రిలీజ్ కార్యక్రమం నిర్వహించి మంగళవారం జరిగే కార్యక్రమానికి నాయకులు కార్యకర్తలు రైతులు మరియు వైఎస్ఆర్ కుటుంబ సభ్యులు వేలాదిగా పాల్గొనవలసిందిగా కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్వతీపురం నియోజకవర్గం వైఎస్ఆర్సిపి సమన్వయకర్త అలజింగ్ జాగా రావు , జిల్లా కమిటీ నాయకులు,జిల్లా యూత్ వింగ్ అధ్యక్షులు , జిల్లా క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షులు, మైనారిటీ సెల్ అధ్యక్షులు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు,జిల్లా ఉపఅధ్యక్షులు, నియోజకవర్గాల నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.





## మాజీ జడ్పీటీసీ పి. వెంకటరాంరెడ్డిపై అభినందనల వర్షం


**ప్రజాస్వరం, రంగారెడ్డి జిల్లా బ్యూరో(సెప్టెంబర్ 06):**

తెలంగాణ ఉద్యమకారుల వెల్ఫేర్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు వెంకట్ రాంరెడ్డికి అభినందనలు తెలిపినషాద్ నగర్ ఎమ్మెల్యే విర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి. షాద్ నగర్ నియోజక వర్గానికి చెందిన తెలంగాణ ఉద్యమ నేత, ఫరూఖ్ నగర్ మండల మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పి.వెంకట్ రాంరెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా షాద్ నగర్ ఎమ్మెల్యే విర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు మామిడి శ్యామ్ సుందర్ రెడ్డి జిల్లా అధ్యక్షుడుగా ఎన్నికైన వెంకట్ రాంరెడ్డికి బోకే, శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంకట్ రాంరెడ్డి మరిన్ని ఉన్నత స్థాయికి ఎదగాలి అని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కృష్ణ రెడ్డి,షాద్ నగర్ మున్సిపల్ మాజీ చైర్మన్ అగ్గనూర్ విశ్వం, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కోంకళ్ళ చెన్నయ్య, కొత్తూరు సుదర్శన్ గౌడ్, విరేష్ అప్ప,ఉద్యమకారుడు జాంగారి రవి, కాంగ్రెస్ నేతలు జాకరం చంద్రశేఖర్, గోవర్ధన్ గౌడ్, ముబరక్ ఖాన్, గోపాల్, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ చికిత్సలో మెరుగైన పద్ధతి..

## ఇకపై 40 శాతం మరణాలు నివారించవచ్చు

ప్రపంచ వ్యాప్తంగా సర్వైకల్ క్యాన్సర్‌తో బాధపడేవారి సంఖ్య నానాటికీ పెరుగుతుంది. దీనికి ప్రధాన కారణం చివరి దశలో ఈ క్యాన్సర్ గుర్తించడమే. అయితే తాజా పరిశోధనలు ఈ క్యాన్సర్ చికిత్సలో మెరుగైన పద్ధతిని కనుగొన్నారు. దీని ద్వారా 40 శాతం మరణాలను అడ్డుకోవచ్చంటున్నారు పరిశోధకులు.. మహిళల్లో సర్వైకల్ క్యాన్సర్ సర్వసాధారణంగా మారుతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం.. రొమ్ము క్యాన్సర్ తర్వాత, ప్రపంచవ్యాప్తంగా మహిళల్లో అత్యధిక సంఖ్యలో గర్భాశయ క్యాన్సర్ కేసులు పెరుగుతుయి. మరణాల పరంగా రొమ్ము క్యాన్సర్ కంటే గర్భాశయ క్యాన్సర్ చాలా ప్రమాదకరమైనది. ఈ క్యాన్సర్‌తో బాధపడుతున్న మహిళల మరణాల సంఖ్య ఏటా పెరుగుతోంది. ఏటా దాదాపు 4 లక్షల మంది మహిళలు ఈ క్యాన్సర్‌తో మరణిస్తున్నారు. గర్భాశయ క్యాన్సర్ కేసుల్లో చాలా వరకు చివరి దశలో అభివృద్ధి చెందుతాయి. ఇది చికిత్సను కష్టతరం చేస్తుంది. దీంతో మహిళలు ప్రాణాలు కోల్పోతున్నారు. తాజాగా పరిశోధకుల రీసెర్చ్ ఈ వ్యాధి చికిత్సలో గొప్ప విజయాన్ని సాధించారు. ఈ చికిత్సతో సర్వైకల్ క్యాన్సర్ మరణాలను 40 శాతం తగ్గించవచ్చని అంటున్నారు.



### ఈ కొత్త టెక్నాలజీతో సర్వైకల్ క్యాన్సర్ చికిత్స...

**పెరుగుతున్న గర్భాశయ క్యాన్సర్ కేసుల దృష్ట్యా.. వైద్యులు మెరుగైన చికిత్సను కనుగొనడానికి ప్రయత్నిస్తున్నారు. సంవత్సరాలుగా దానిపై అధ్యయనాలు చేస్తున్నారు. ఇటీవల వైద్యులు దాని చికిత్సలో సానుకూల ఫలితాలను పొందారు. ఈ పరిశోధనకు యూకే, మెక్సికో, భారత్, ఇటలీ, బ్రెజిల్‌లతో సహా 10 సంవత్సరాలకు పైగా ఈ క్యాన్సర్‌తో బాధపడుతున్న మహిళలను తీసుకున్నారు. ఈ చికిత్సలో కెమోరేడియేషన్‌కు ముందు కీమోథెరపీని చిన్న సెషన్‌లు ఇచ్చారు. యూనివర్సిటీ కాలేజ్ లండన్ నేతృత్వంలోని ఈ పరిశోధన మూడవ, నాల్గవ దశ క్యాన్సర్ చికిత్సలో చాలా మంచి ఫలితాలను చూపించింది. ఫలితంగా ఈ వ్యాధి నుండి మరణించే ప్రమాదాన్ని 40 శాతం తగ్గించవచ్చని తేలింది. పైగా ఈ క్యాన్సర్ మళ్లీ వచ్చే ప్రమాదం 35 శాతం తగ్గింది కూడా. మహిళలపై నిర్వహించిన ఈ పరిశోధన ఫేజ్ 3 ట్రయల్‌లో విజయవంతమైనట్లు పరిశోధకులు తెలిపారు. ఈ కొత్త చికిత్స విధానంపై పెద్ద ఎత్తున పరిశోధన చేయనప్పటికీ, ఈ పరిశోధన ఫలితాలు గర్భాశయ క్యాన్సర్ చికిత్సలో గొప్ప విజయంగా భావిస్తున్నారు.**



### ప్రతి ఏడాది 6,60,00 కొత్త గర్భాశయ క్యాన్సర్ కేసులు...

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం.. ప్రతి సంవత్సరం 6,60,00 కొత్త గర్భాశయ క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయి. ఈ క్యాన్సర్‌తో బాధపడుతున్న మహిళల్లో సగానికి పైగా మరణిస్తున్నారు. దీని బారిన పడిన స్త్రీలలో చాలా మంది దాదాపు 50 సంవత్సరాల వయస్సు గలవారు ఉంటున్నారు. 30 నుండి 40 శాతం కేసులలో ఈ క్యాన్సర్ నయమైన తర్వాత మళ్లీ తిరిగి వస్తుంది. రెండో సారి తిరగబెట్టినప్పుడు ఇది మరింత ప్రాణాంతకంగా మారి మరణానికి కారణమవుతుంది. గర్భాశయ క్యాన్సర్‌లో మరణాల సంఖ్య పెరగడానికి కారణం ఆలస్యంగా గుర్తించడమే. చాలామంది మహిళలు నాల్గవ దశలో ఈ క్యాన్సర్‌ను గుర్తిస్తున్నారు. కానీ ఇప్పుడు శాస్త్రవేత్తలు ఆధునాతన చికిత్సను కనుగొన్నారు. దీని ద్వారా క్యాన్సర్‌ను తొలినాళ్లలోనే గుర్తించి, చికిత్స చేసేందుకు సాధ్యమవుతుంది . తద్వారా మరణ ప్రమాదాన్ని తగ్గించవచ్చు.

### గర్భాశయ క్యాన్సర్‌ను ఎలా నివారించాలి...

- △ ధూమపానం మానుకోవాలి
- △ ఒకటి కంటే ఎక్కువ భాగస్వాములతో సంబంధాలు ఏర్పరచుకోకుండా ఉండటం
- △ చిన్నవయసులోనే శారీరక సంబంధాలు పెట్టుకోకపోవడం మంచిది
- △ గర్భనిరోధక మాత్రలు ఎక్కువగా తీసుకోకూడదు
- △ సర్వైకల్ క్యాన్సర్‌ను పరీక్షించడానికి ఎప్పటికప్పుడు పాప్ స్మియర్ పరీక్ష చేయించుకోవాలి
- △ గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను నివారించడానికి టీకాలు వేయించుకోవాలి

### గర్భాశయ క్యాన్సర్ ఎందుకు వస్తుంది...?

- △ ఒకటి కంటే ఎక్కువ భాగస్వాములతో సంబంధాలను కలిగి ఉండటం
- △ ధూమపానం
- △ గర్భనిరోధక మాత్రలు అధికంగా తీసుకోవడం కలిగి ఉండటం



## వెన్నునొప్పితో బాధపడుతున్నారా?

# ఇలా చేస్తే ఉపశమనమే..



ప్రస్తుత రోజుల్లో చాలామంది ఒకే చోట కదలకుండా గంటల తరబడి కూర్చుని పనిచేస్తుంటారు. దీని వల్ల వెన్నెముక సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ సమస్యలను ఇలాగే వదిలేస్తే అనతి కాలంలోనే సమస్య తీవ్రం అవుతుంది. ఇలా అవకుండా ఉండాలంటే.. గంటల తరబడి ఒకేచోట పనిచేయడం వల్ల వెన్నుపాము నొప్పి రావడం సాధారణ సమస్యగా మారింది. ఈ సమస్య ప్రతి ఒక్కరిని ఇబ్బంది పెడుతుంది. కానీ కొంతమందిలో ఇది చాలా కాలం పాటు కొనసాగుతుంది. దీనివల్ల ఏ పని చేయాలన్నా ఇబ్బందులు పడుతుంటారు. చాలా మంది వెన్నెముక నొప్పిని నిర్లక్ష్యం చేస్తుంటారు. కొన్ని సందర్భాల్లో వెన్నెముక కూడా దెబ్బతింటుంది. దీని కారణంగా హెర్నియేటెడ్ డిస్క్, వెన్నునొప్పి, పార్శ్వగూని వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. వెన్నెముక నొప్పిని నిర్లక్ష్యం చేయకూడదని ఢిల్లీలోని ఇండియన్ స్పైనల్ ఇంజూరీస్ సెంటర్‌లో వెన్నెముక సేవల చీఫ్ డాక్టర్ వికాస్ టాండన్ అంటున్నారు. ఈ సమస్య చాలా కాలం పాటు కొనసాగితే, కీళ్లనొప్పులు, వెన్నుపాము దెబ్బతినడానికి కూడా దారితీయవచ్చు. వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ చిరోప్రాక్టిక్ ద్వారా అక్టోబర్ 16న ప్రపంచ వెన్నెముక దినోత్సవాన్ని జరుపుకుంటామని డాక్టర్ వికాస్ టాండన్ వివరించారు. ఇది 2008లో ప్రారంభమైంది. వెన్నెముకకు సంబంధించిన వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించడమే దీని ఉద్దేశం. గంటల తరబడి కూర్చొని పనిచేయడం, చెడు భంగిమ, బలహీనమైన జీవనశైలి, గాయం వెన్నెముకలో నొప్పికి కారణమవుతుందని డాక్టర్ వికాస్ వివరిస్తున్నారు. ఈ నొప్పి ప్రారంభంలో స్వల్పంగా ఉంటుంది. తరువాత క్రమంగా పెరుగుతుంది. కానీ దానిని విస్మరించకూడదు. వెన్నెముకకు సంబంధించిన ఎలాంటి సమస్య రాకుండా ఉండాలంటే మంచి భంగిమలో కూర్చోవాలి. లేవడం, కూర్చోవడం, నడిచే విధానం సరిగ్గా ఉండాలి. సరిగ్గా కూర్చోవడం మన మెదడుపై అనేక విధాలుగా సానుకూల ప్రభావాన్ని చూపుతుంది. ఇది వెన్నెముక సంబంధిత సమస్యల ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుంది. నిటారుగా కూర్చోవడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గుతుంది. నిటారుగా కూర్చుంటే శరీరంలో కార్టిసాల్ హార్మోన్ స్థాయి తగ్గుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఇది మానసిక ఒత్తిడిని తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. వెన్నెముకకు సంబంధించిన ఎలాంటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు జీవనశైలిని చక్కగా ఉంచుకోవాలి. ప్రతిరోజు యోగా చేయాలి. పోషకాహారం తీసుకోవాలి. ముఖ్యంగా ఆహారంలో కాల్షియం, విటమిన్ డి అధికంగా ఉండే వాటిని చేర్చుకోవాలి.

# గర్భిణీలు స్మోకింగ్ చేస్తే.. అతి ప్రమాదకరం

పొగతాగడం ఆరోగ్యానికి ఎంతో హానికరమని అందరికీ తెలిసిందే. ఎన్నో రకాల ఆరోగ్య సమస్యలకు స్మోకింగ్ ప్రధాన కారణం. అందుకే ఈ అలవాటును మానుకోవాలని వైద్యులు సూచిస్తుంటారు. గుండె సంబంధిత సమస్యలు మొదలు ఎముకలు, మెదడు ఆరోగ్యంపై కూడా స్మోకింగ్ తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. అయితే గర్భిణీలు ఒకవేళ స్మోకింగ్ చేస్తే మరింత ప్రమాదకరమని నిపుణులు అంటున్నారు. ఇందుకు సంబంధించి తాజాగా చైనాకు చెందిన ఆరోగ్య సంస్థ హెచ్చరించింది. తాజాగా నిర్వహించిన ఓ సర్వేలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. స్మోకింగ్ వల్ల గర్భిణులకు తీవ్ర అనర్థాలు తప్పవని అంటున్నారు. సిగరెట్ పొగలో ఏకంగా నాలుగు వేల రకాల రసాయనాలు ఉంటాయి.



**సాధారణంగా స్మోకింగ్ చేసే వారిలో ఈ రసాయనాలు రక్తంలో కలిసిపోతాయి. దీంతో ఈ రసాయనాలు ప్లాసెంటా ద్వారా కడుపులోని పిండాన్ని చేరుతాయి. ఇది శిశువు ఎగుదలకు, మానసిక అభివృద్ధికి తీవ్రమైన ఇబ్బందులు కలిగిస్తాయని అధ్యయనంలో తేలింది. అంతేకాకుండా స్మోకింగ్ చేయడం వల్ల గర్భిణీ హృదయ స్పందనల రేటుపై కూడా ప్రభావం పడుతుంది. దీంతో డెలివరీ సమయంలో తల్లి ఆరోగ్యంపై ఇది తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది.**

అయితే గర్భం దాల్చకముందు సిగరెట్ అలవాటు ఉండి. గర్భం దాల్చిన తర్వాత మానేసినా ఈ సమస్య వచ్చే అవకాశం 27 శాతం ఉంటుందని పరిశోధకులు చెబుతున్నారు. గర్భం దాల్చిన సమయంలో కూడా స్మోకింగ్ చేస్తే ఈ ముప్పు 31 శాతం నుంచి 32 శాతం వరకు ఉంటుందని సర్వేలో తేలింది. గర్భిణీలు స్మోకింగ్ చేస్తే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంపై కచ్చితంగా నేరుగా ప్రమాదం పడుతుందని, తల్లి కావాలనుకునే వారు కనీసం 6 నెలల ముందు నుంచి ఈ అలవాటును మానేయడం ఉత్తమం అని చెబుతున్నారు.





# ‘పుష్ప 3’ కచ్చితంగా ఉంటుంది.. సైమా వేదికపై సుకుమార్ కామెంట్

అల్లు అర్జున్, సుకుమార్ కాంబినేషన్‌లో వచ్చిన బ్లాక్‌బస్టర్ చిత్రం ‘పుష్ప’. అవార్డులు, రివార్డులను సొంతం చేసుకున్న ఈ మూవీ దుబాయ్ వేదికగా జరిగిన ‘సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్’ (సైమా) లోనూ సత్తా చాటింది. అత్యధిక నామినేషన్లు దక్కించుకున్న ‘పుష్ప 2’.. ఏకంగా ఐదు విభాగాల్లో అవార్డులను సొంతం చేసుకుంది. ఉత్తమ నటుడు (అల్లు అర్జున్), ఉత్తమ నటి (రష్మిక), ఉత్తమ దర్శకుడు (సుకుమార్), ఉత్తమ సంగీత దర్శకుడు (దేవి శ్రీప్రసాద్), ఉత్తమ గాయకుడు (శంకర్ బాబు) విభాగాల్లో ‘పుష్ప 2’కు అవార్డులు దక్కాయి.

మరోవైపు ‘పుష్ప 3: ది ర్యాంపేజ్’ పేరుతో మూడో భాగం రానున్నట్లు గతంలో పోస్టర్ విడుదలైన విషయం తెలిసిందే. అయితే, ఆ తర్వాత ఎలాంటి అప్‌డేట్ లేదు. అసలు ‘పుష్ప 3’ ఉంటుందా.. ఉండదా అన్న అనుమానాలకు సైమా వేదికగా సుకుమార్ క్లారిటీ ఇచ్చారు. వ్యాఖ్యాత అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ.. ‘పుష్ప 3’ కచ్చితంగా ఉంటుందిగా..’ అన్నారు. దీంతో అల్లు అర్జున్ అభిమానులు సంబర పడుతున్నారు.

సైమా అవార్డు వేడుకలో తారలు పంచుకున్న మరికొన్ని ముచ్చట్లు..

“తాజాగా ఉస్తాద్ భగత్ సింగ్‌కు ఒక పాట షూట్ చేశారు. అది విని పవన్ కల్యాణ్ (Pawan kalyan) ప్రశంసించారు. నాకు షేక్‌హ్యాండ్ ఇచ్చి ‘అదరగొట్టావ్.. నీ పాటతో చాలా రోజుల తర్వాత నాలో డ్యాన్స్ చేయాలనే కోరిక కలిగించావ్’ అని అన్నారు. ఆ మాటకు గాల్లో తేలిపోయా” - దేవి శ్రీ ప్రసాద్

“మహేశ్ - రాజమౌళి ప్రాజెక్ట్ (SSMB29) కోసం ప్రపంచమంతా ఆసక్తిగా ఎదురు చూస్తోంది. త్వరగా విడుదలవ్వాలని నేనూ ఎదురుచూస్తున్నా. కానీ మన చేతుల్లో ఏమీ లేదు.



# SIIMA లో నాలుగు అవార్డులు దక్కించుకున్న.. కల్కి 2898 AD

దక్షిణ భారత సినిమా మరోసారి అంతర్జాతీయ వేదికపై తన ప్రతిభను చాటుకుంది. సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్ (SIIMA) 2025 ఈసారి దుబాయ్ ఎగ్జిబిషన్ సెంటర్, ఎక్స్‌పో సిటీలో ఘనంగా నిర్వహించబడింది. లైట్ల తళుకులు, గ్లామర్, సంగీతం, డ్యాన్స్‌లతో స్టార్ పవర్ నిండిన ఈ వేడుకలో దక్షిణ భారత సినీ ఇండస్ట్రీలోని ప్రముఖులు ఒకచోట చేరారు. మొదటి రోజు ప్రత్యేకంగా తెలుగు సినిమాకి అంకితం చేయబడింది. టాలీవుడ్‌కి చెందిన నటులు, దర్శకులు, నిర్మాతలు, సాంకేతిక నిపుణులు, అభిమానులు అందరూ ఈ వేదికపై కలుసుకుని సినీ విజయాలను జరుపుకున్నారు.

ఈ వేడుకలో ప్రభాస్ నటించిన ‘కల్కి 2898 AD’ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. నాలుగు ప్రతిష్టాత్మక విభాగాల్లో ఈ చిత్రం అవార్డులు గెలుచుకుంది.

1. ఉత్తమ చిత్రం (Best Film) అవార్డు
2. అమితాబ్ బచ్చన్ – ఉత్తమ సహాయ నటుడు
3. అన్నాబెన్ – ఉత్తమ సహాయ నటి
4. కమల్ హాసన్ – ఉత్తమ విలన్

ఈ విజయాలతో కల్కి 2898 AD మరోసారి పాన్ ఇండియా స్థాయిలో తన ప్రభావాన్ని రుజువు చేసింది.

# ప్రభాస్ స్పిరిట్ గురించి సీక్రెట్ చెప్పిన సందీప్ రెడ్డి..



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ సినిమాలపై ఉండే హైప్ అంతా ఇంతా కాదు. ఇప్పుడు ప్రభాస్ సందీప్ రెడ్డి వంగా కాంబోలో రాబోతున్న స్పిరిట్ మూవీ గురించి ఫ్యాన్స్ ఆతృతగా వెయిట్ చేస్తున్నారు. ఆ మూవీ గురించి ఏ చిన్న విషయం అయినా సరే సోషల్ మీడియాలో భారీగా వైరల్ అవుతోంది. తాజాగా డైరెక్టర్ ఆర్జీవీతో కలిసి సందీప్ రెడ్డి వంగా జగపతి బాబు ప్రోగ్రామ్ కు వెళ్లాడు. మనకు తెలిసిందే కదా జగపతి బాబు హోస్ట్ గా చేస్తున్న జయమ్ము నిశ్చయమ్మురా ప్రోగ్రామ్ ఎంత పాపులర్ అవుతుందో. ఈ ప్రోగ్రామ్ కు సంబంధించిన ఎపిసోడ్ తాజాగా రిలీజ్ చేశారు. ఇందులో సందీప్ రెడ్డిని స్పిరిట్ సినిమా గురించి అడిగాడు జగపతి బాబు. సందీప్ రెడ్డి మాట్లాడుతూ.. స్పిరిట్ సినిమా కోసం బీజీఎంను 70 శాతం రెడీ చేశామన్నాడు సందీప్.

నేను యానిమల్ సినిమా స్టార్ట్ చేయడానికి ముందే 80 శాతం బీజీఎం కంప్లీట్ అయిపోయింది. అది అనుకున్నట్టే బాగా వర్కౌట్ అయింది. ఇప్పుడు స్పిరిట్ సినిమా కోసం అలానే ప్లాన్ చేశాను. ఇప్పటికే 70 శాతం బీజీఎం కంప్లీట్ అయిపోయింది. ప్రభాస్ అన్నకు బీజీఎం సెట్ చేయడం చాలా ఈజీ. ఆయన కటౌట్ కు తగ్గట్టు సీన్లు రాయడం, బీజీఎం చేయడం పెద్ద కష్టమేమీ కాదు అన్నాడు సందీప్ రెడ్డి. త్వరలోనే షూటింగ్ స్టార్ట్ అవుతుందని.. ఆ తర్వాత వరుసగా అప్డేట్లు ఇస్తామని తెలిపాడు సందీప్ రెడ్డి. దీంతో అతను చేసిన కామెంట్లు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. స్పిరిట్ సినిమాలో ప్రభాస్ సిన్సియర్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించబోతున్న సంగతి తెలిసిందే. ఈ మూవీకి హర్షవర్ధన్ రామేశ్వర్ మ్యూజిక్ అందిస్తున్న విషయం తెలిసిందే.



# నీకు భార్యలా కాదు.. తల్లిలా కనిపిస్తా.. హీరోయిన్ రిప్లై

హీరోయిన్లు అంటే కుర్రాళ్లకు ఫేవరెట్ గానే ఉంటారు. హీరోయిన్లకు ప్రపోజల్స్ కూడా బోలెడన్ని వస్తూనే ఉంటాయి. కాకపోతే వాటిని ఎలా తీసుకోవాలనేది వారి ఇష్టం. తాజాగా ఓ హీరోయిన్ తన వెంట పడుతున్న 17 ఏళ్ల కుర్రాడికి షాకింగ్ రిప్లై ఇచ్చింది. ఈ మేరకు ఆమె సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టింది. ఆమె ఎవరో కాదు.. హీరోయిన్ అవంతిక మోహన్. ఓ పదిహేడేళ్ల కుర్రాడు ఏడాది కాలంగా ఆమెను పెళ్లి చేసుకోవాలని రోజూ మెసేజ్ లు పెడుతున్నాడంట. ఇదే విషయాన్ని ఆమె సోషల్ మీడియా వేదికగా తెలిపింది. నా వెంట పడుతున్న ఓ చిన్న అభిమానికి నేను ఓ విషయం చెప్పదలచుకున్నా. ఏడాది కాలంగా నిన్ను పెళ్లి చేసుకోమని నాకు మెసేజ్ లు పెడుతున్నావ్. నువ్వు చాలా చిన్నవాడివి. చదువుకునే ఏజ్ లో ఉన్నావ్.

నేను నీ కంటే చాలా పెద్దదాన్ని. నువ్వు బుద్ధిగా చదువుకుని పైకి ఎదగాలి. అంతే గానీ నా వెంట పడటం కరెక్ట్ కాదు. ఒకవేళ నేను నిన్ను పెళ్లి చేసుకుంటే నీకు భార్యలా కాదు.. తల్లిలా కనిపిస్తా. కాబట్టి ఇలాంటివి మానేసి బుద్ధిగా చదువుకో అంటూ సజెస్ట్ చేసింది. ఆమె చేసిన కామెంట్లు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. హీరోయిన్లకు ఇలాంటి పెళ్లి ప్రపోజల్స్ చాలా కామన్ గానే సోషల్ మీడియాలో తరచూ వస్తుంటాయి. కానీ వాళ్లు అవన్నీ పట్టించుకోరు. అవంతిక మాత్రం ఇలా ప్రత్యేకంగా సోషల్ మీడియాలో పోస్టు చేయడం నిజంగా ఆశ్చర్యంగానే ఉంది ఆమె అభిమానులకు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999